క్లుప్తంగా

వంతెనపై గుంత పూడ్చివేత



గుంతను పూడ్చిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: వంతెనపై కుంగిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్న కథనంతో అధికారులు స్పందించారు. పొన్నలూరు–నాగిరెడ్డిపాలెం మధ్యలో ఓవీ రోడ్డు ఎర్రవాగు దగ్గర ఉన్న వంతెన కొంత మేరా కుంగిపోయి గుంత ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో ముగ్గురు మహిళా కూలీలకు తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యారు. అయితే ఈ సమస్యపై సాక్షి దినపత్రికలో'ఆదమరిస్తే..ఆసుపత్రిపాలే' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన సంబంధిత అధికారులు శుక్రవారం సాయంత్రం వంతెనపై ఏర్పడిన గుంతను కంకర, తారుతో పూడ్చి సమస్యను పరిష్కరించారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేసి సాక్షిని అభినందించారు.

నివాళులు



నివాళులర్పిస్తున్న తిరుపతిరెడ్డి, పార్టీ నేతలు

వెలిగండ్ల(కనిగిరిరూరల్): మండలంలోని ఇమ్మడి చెరువులో వైఎస్సార్ సీపీ నాయకుడు జుటికే ఆరోన్ సతీమణి జే విజయమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఈమేరకు విజయమ్మ భౌతిక కాయాన్ని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షులు పొల్లా సుబ్రహ్మణ్యం, పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, వై నాగూర్ యాదవ్, యెలికా నారాయణ, తాతపుడి సురేష్ బాబు, గంజి రవీంద్రారెడ్డి, తాతపుడి నాని తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ



పెట్రోల్ బంకుల్లో తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని రెండు పెట్రోల్ బంకులను శుక్రవారం తహశీల్దార్ టీ రవి ఆకస్మిక తనిఖీ చేశారు. దేవి సీఫుడ్స్ సమీపంలోని బీఎంఆర్ ఫ్యూయల్స్‌లో అధికారులు తనిఖీలు చేశారు. పాతసింగరాయకొండ జాతీయ రహదారి పక్కన ఉన్న బాలాజీ బాబా పెట్రోల్ బంకులో వినియోగదారులకు అందించాల్సిన వసతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీనిపై వారిపై చర్యలు తీసుకోవాలని నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తహశీల్దార్ వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీ శివరామకృష్ణ, ఆర్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు, సర్పంచ్

కనిగిరిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన మెరుగైన విద్య లభిస్తుందని సర్పంచ్ దమ్ము వెంకటయ్య అన్నారు. మండలంలోని ఏరువారిపల్లిలో శుక్రవారం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, టీచర్లు ఇంటింటి ప్రచారం కార్యక్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పిల్లలను పాఠశాలకు పంపించాలన్నారు. విద్యతోనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పాఠశాలలోని సౌకర్యాలు, మౌలిక వసతులను గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్థిక అంశాల నిర్వహణపై అవగాహన



బాలికలచేత ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ పార్వతి

పొమూరు: కిశోర బాలికలు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. కిశోరి వికాసం, వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మార్కొండాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి బాలికలు, మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపుపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

అన్నదాతకు.. కూటమి దెబ్బ !



నేతివారిపాలెంలో దుక్కులు దున్నుతున్న రైతు

- ప్రారంభమైన లోతు దుక్కులు
- అన్నదాత సుఖీభవ అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వం
- నియోజకవర్గంలో 40 వేల మందికి పైనే రైతులు

కొండపి:

ఏడాదంతా రైతులు సర్వం పోగొట్టుకున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లు మొత్తం తుడిచిపెట్టుకుపోయాయి. ప్రకృతిని దీటుగా ఎదుర్కొని పంటలు పండిస్తే కూటమి ప్రభుత్వం రూపంలో కష్టాలు ఎదురయ్యాయి. ఏ పంటకూ సరైన గిట్టుబాటు ధర లేక అప్పులపాలయ్యారు. అన్నదాత సుఖీభవ, పంటల ఇన్‌పుట్ సబ్సిడీ, యంత్రాలు ఇలా అందక వ్యవసాయం కుదేలైయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఆర్భాటంగా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి నేటికీ తడబడుతూనే ఉంది. డబుల్ ఇంజన్ సర్కారుగా చెబుతున్న కూటమి నాయకులు రైతులకు అండగా ఉంటామని ఏ కష్టం రాకుండా ముందస్తు చర్యలు చేపట్టడమే కాకుండా అన్నదాత సుఖీభవ పథకం పేరిట రూ.20 వేలు అందిస్తామని అప్పట్లో ప్రకటించారు. అధికారం చేపట్టి దాదాపు ఏడాది అయ్యింది. ఇప్పటివరకు రైతు సంబంధిత సంక్షేమం అంటూ ఏమీ లేదు. కిసాన్ సమ్మన్ నిధి ద్వారా రైతుకు అందే నిధులు మినహాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా జమ కావడం లేదు.

ఏ ఏడాదైనా అందేనా..

ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు రాష్ట్రాన్ని పలకరిస్తాయని వాతావరణ శాఖ పరమైన అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతువులు వేసవి దుక్కులు పూర్తి చేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు.ఈ సమయంలో పెట్టుబడులకు రైతు చేతిలో చిల్లిగవ్వలేక అప్పులు చేసేందుకు దారులు వెతుకుతున్నారు. ఈ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందని నియోజకవర్గ పరిధిలో సుమారు 40 వేల మంది రైతులు ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో వ్యవసాయం పండగ..

నియోజకవర్గంలో ఆరు మండలాల్లో సుమారు 40 వేల కుటుంబాలకు పైగా రైతుల ఉన్నారు. ప్రతి ఏటా వరి, కంది, శనగలు, పొగాకు, బొప్పాయి, ఎండుమిర్చితో పాటు వివిధ పంటలు సాగు చేస్తారు. వారికి సేద్యంపై నమ్మకం కలిగించి అండగా నాడు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం నిలబడింది. క్షేత్రస్థాయిలో రైతులకు సేవలు అందించేందుకు విత్తనం మొదలుకొని పంట దిగుబడి విక్రయం వరకు అన్ని విషయాల్లోనూ ప్రభుత్వం తోడుగా నిలిచింది. ప్రతి మండలంలో సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులతో పాటు పెట్టుబడి సాయం రైతు భరోసా నేరుగా రైతు ఖాతాలకు జమ చేసేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంతవరకు రైతు ఖాతాల్లో ఒక్క పైసా కూడా జమ కాలేదు.

మాట తప్పిన కూటమి..



టీడీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఏటా అందిస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, లబ్ధి పొందేందుకు సమీప రైతు సేవ కేంద్రాలకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేదన్నడో.. అర్హులను గుర్తించి నిధులు విడుదల చేసేది ఎప్పుడో అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

– సురేష్, రైతు, నేతివారిపాలెం

సాయం అందించాలి..



వాతావరణ ప్రతికూల పరిస్థితులకు కొనసాగుతున్నాయి. రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రబీ సీజన్‌లో వేసిన పంటలు నష్టాలు మిగిల్చాయి. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతుంది. వేసవి దుక్కులకు చేతిలో చిల్లి గవ్వలేకపోయింది. గతంలో మే నెలలో ప్రభుత్వం నుంచి పెట్టుబడి సహాయం అందేది. ఇప్పుడు ఆ పరిస్థితి దగ్గరలో కానరావడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

– వీ ప్రసాద్, రైతు అనకర్లపూడి

యోగాంధ్ర కాదది.. శిక్షాంధ్ర ఇది

- శిక్షణకు గైర్హాజరవుతున్న గ్రామ సచివాలయ సిబ్బంది
- పిల్లలతో మమ అనిపిస్తున్న వైనం

సింగరాయకొండ: లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు కోసం జూన్ 21వ తేదీ జాతీయ యోగా దినోత్సవం రోజు లక్షలాది మందితో తలపెట్టిన యోగా శిక్షణ కార్యక్రమం యోగాంధ్ర మా పాలిట తలనొప్పిగా మారిందని గ్రామ సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేది నుంచి జూన్ 20 వతేది వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగాల్సి ఉంది. ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మండలస్థాయిలో ప్రత్యేక శిక్షకులతో మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది 151 మందికి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వీరు తరువాత జూన్ 1వ తేదీ నుంచి గ్రామస్థాయిలో తమకు కేటాయించిన వారికి శిక్షణ ఇచ్చి జూన్ 21వ తేదీ జరిగే కార్యక్రమానికి వారిని సన్నద్ధం చేయాల్సి ఉంది.

శిక్షణకు దుమ్మా కొడుతున్న సచివాలయ సిబ్బంది..

మండల కాంప్లెక్స్‌లో జరిగే శిక్షణలో నాలుగు రోజుల పాటు సచివాలయ సిబ్బంది పాల్గొని నేర్చుకోవాలి. కాని మొదటి రెండు రోజులు మాత్రమే పూర్తిస్థాయిలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది తరువాత రెండు రోజులు శిక్షణకు దుమ్మా కొట్టగా మిగిలిన సచివాలయ సిబ్బంది ఎగ్గొట్టిన వారి స్థానంలో తమ పిల్లలను తీసుకుని వచ్చి శిక్షణను మమ అనిపించారు. ఈ ప్రకారం వీరు గ్రామాలకు వెళ్లి ప్రజలను ఏవిధంగా సమాయత్తం చేస్తారు. ప్రభుత్వ లక్ష్యం నీరు గారే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. వాస్తవానికి సచివాలయ సిబ్బంది ఆయా గ్రామాలలోనే నివాసం ఉండాలి. కాని వీరిలో సగం మందికి పైగా ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటారు. దీంతో ప్రతి రోజు ఉదయాన్నే శిక్షణకు వచ్చి సాయంత్రం దాకా విధులు నిర్వర్తించాల్సి రావడంతో దుమ్మా కొట్టాల్సి వస్తుందని సచివాలయ సిబ్బంది తెలియజేస్తున్నారు.



శిక్షణలోపాల్గొన్న సచివాలయ సిబ్బంది పిల్లలు

మా బాధలు ఎవరికి ఎరుక..

మండలంలో 67,494 గృహాలు ఉండగా వాటిలో 27,813 గృహాల వారిని యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఇందు కోసం వారి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. నిన్నటివరకు ఉపాధి హామీ పథకం, డ్వాక్రా సిబ్బంది తమ వద్ద ఉన్న ఆధార్‌కార్డులు, ఫోన్ నెంబర్ల సహాయంతో యాప్‌లో నమోదు చేశారు. డ్వాక్రా అధికారులయితే తమ సిబ్బందికి రెండు గంటల్లో 250 మంది పేర్లు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారంటే వారిపై ఉన్నతాధికారుల ఒత్తిడి ఏవిధంగా ఉందో అర్థం అవుతుంది. ఈ యోగాంధ్ర కార్యక్రమం మాకు చుక్కలు చూపిస్తుందని సచివాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి



సింగరాయకొండలో మాట్లాడుతున్న డీటీ ముస్తాక్



సీఎస్‌పురంలో వీఆర్‌ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): పొలాలను కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్న కౌలురైతులందరు కౌలు కార్డులు (పంట సాగుహక్కు పత్రం) కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఓలతో వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ అధికారులతో కలిసి కౌలురైతులకు కౌలుకార్డుల జారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 1012 కౌలుకార్డుల జారీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఏఓ సంపత్‌కుమార్ కౌలుకార్డులవల్ల రైతులకు ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పద్మనాభం, వీఆర్‌ఓలు, వ్యవసాయ, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: సాగుదారు హక్కు పత్రం కలవారికి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వడంపై రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ షేక్ ముస్తాక్ ఆధ్వర్యంలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీటీ ముస్తాక్ మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు ఉన్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ వంటి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని, కావున ప్రతి ఒక్కరు కౌలు గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని సూచించారు. ఏఓ సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాచూరి పెద్దమ్మ తిరునాళ్లు



విశిష్ట అలంకరణలో పెద్దమ్మ తల్లి మూల విగ్రహమూర్తి

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రమైన సీఎస్ పురం వడియరాజుల నగర్‌ని రాచూరి పెద్దమ్మతల్లి ఆలయంలో ఆలయ తిరునాళ్ల మహోత్సవాలు నేడు శనివారం నుంచి జూన్ 05వ తేదీ గురువారం వరకు 6 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మొదటి రోజు 31వ తేదీ వెంకటేశ్వరస్వామి జలది ఉత్సవం, పూజలు, పొంగళ్లు, జూన్ 01వ తేదీ అంకాళమ్మతల్లి జది ఉత్సవం, 02వ తేదీ గురప్పస్వామి పూజా కార్యక్రమాలు, 03వ తేదీ పుట్టబంగారం తెచ్చుట, పూజలు, 04వ తేదీ చౌడమ్మ వారి పసుపు కుంకుమ తెచ్చుట, గ్రామోత్సవం, 05వ తేదీ పొంగళ్లు, గండదీపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిరునాళ్లను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధి కొత్తసీతారాంపురం గ్రామంలో శుక్రవారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు స్వామివారిని పట్టువస్త్రాలతో అలకంరించారు. స్వామివారికి శేషవస్త్రాలు సమర్పించి స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చిన భక్తులు సీతారాముల కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాల నడుమ సీతారాముల వారికి మేళ తాళాల సందడితో వైభవంగా పద్మనాభుని ప్రసాద్ దంపతులు స్వామివారికి అర్చకులు వేద మంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్సీ, ఎస్టీలకు పౌరహక్కులపై అవగాహన ఉండాలి

సింగరాయకొండ: మండలంలోని ఎస్సీ, ఎస్టీలకు ప్రధానంగా పౌరహక్కులపై అవగాహన ఉండాలని తహశీల్దార్ టి రవి అన్నారు. మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ అప్పాపురం ఎస్టీ కాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. వారికి ప్రాథమిక హక్కులపై అవగాహన ఉండాలని అప్పుడే తమ జరిగే అన్యాయాలపై పోరాటం చేయటానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వ వైద్యాధికారి చైతన్య కృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ రిజ్వానా, వీఆర్ఓ వెంకటాద్రి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

సింగరాయకొండ: మండల కేంద్రంలోని శాంతి థియేటర్ సమీపంలోని రేషన్‌షాపును శుక్రవారం తహశీల్దార్ టీ రవి తన సిబ్బందితో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా షాపులో ఉండాల్సిన బియ్యం నిల్వలు సక్రమంగా ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో షాపుకు రావాల్సిన బియ్యం సివిల్ సప్లయ్ గోడౌన్‌లోనే ఆగుతున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివరామకృష్ణ, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో రాము పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



వార్డులో పర్యటిస్తున్న చైర్మన గఫార్

కనిగిరిరూరల్: అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ఎనిమిదోవార్డులో డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై, పర్యవేక్షణ చేయని అధికారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల పల్లెనిద్ర..



సింగరాయకొండ: మండలంలోని పాకల గ్రామం అంబేడ్కర్ నగర్‌లో ఒంగోలు డీఎస్పీ ఆర్ శ్రీనివాసరావు పల్లెనిద్ర కార్యక్రమంలో గ్రామస్తులతో మాట్లాడారు.

పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠలో దద్దాల



ఇన్‌చార్జి డాక్టర్ దద్దాలను సన్మానిస్తున్న నాయకులు, ఆలయ కమిటీ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని గుంతచెన్నంపల్లె గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం రెండురోజులుగా జరుగుతోంది. ఈసందర్భంగా శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ, గ్రామోత్సవం పూజల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, పలువురు నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారిని ఆలయ కమిటీ, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భువనగిరి వెంకటయ్య, పార్టీ జిల్లా టీయూసీ అధ్యక్షుడు మితికాల గురవయ్య, సర్పంచ్ ఎం.భానుతేజ, మన్నేపల్లి పెద్దన్న, అటేలయ్య, మిరియం వెంకటేశ్వర్లు, గిద్దా మాలకొండయ్య, తిరుమలయ్య, కొత్త శ్రీనివాసులు, నాగేశ్వరరావు, తిరుమలయ్య, కలిగిరి శ్రీరాములు, బండి పద్మనాభం, బుర్రాల పార్థసారథి, కొత్త వాసు, వీరయ్య, గొబ్బిళ్ల శ్రీనివాసులు, తమ్మినేని శివరామిరెడ్డి, ప్రభాకర్, ఈర్ల శ్రీను, మోటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కనిగిరిరూరల్: రైతులు ఖరీఫ్ పంటల సాగుపై అవగాహన కలిగి ఉండాలని కేవీకే, దర్శి సమన్వయకర్త డాక్టర్ జీ రమేష్ అన్నారు. మండలంలోని నందన మార్లెళ్ల, తుమ్మగుంట, బడుగులేరు గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఖరీఫ్ పంటలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం కేవీకే నోడల్ అధికారి కే సంధ్యారాణి అధ్యక్షతన జరిగింది. శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువులు ఎక్కువగాను.. సేంద్రియ ఎరువులు తక్కువగా వేయడం వలన భూమి సారంవంతం తగ్గి పంట దిగుబడి తగ్గడమే కాకుండా పురుగులు ఆశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ ఈ వెంకట రమణ, ఎం షణ్ముగం, వ్యవసాయ అధికారి పీ జోత్స్నదేవి, ఉద్యాన అధికారి జీ అంజలీ భాయి, ఆత్మ, వ్యవసాయ సిబ్బంది, సర్పంచ్‌లు, రైతు మహిళలు పాల్గొన్నారు.

టీబీ రహిత పంచాయతీల సర్పంచ్‌లకు అవార్డులు



జేసీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కోవిలంపాడు సర్పంచ్ ఖాదర్‌బీ బుజ్జి

సీఎస్‌పురం(పామూరు): టీబీ రహిత గ్రామ పంచాయతీలుగా మండలంలోని కోవిలంపాడు, అరివేముల గ్రామ పంచాయతీలు ఎన్నికయ్యాయి. ఈసందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో గతంలో జిల్లా వైద్యాధికారులు చేసిన సర్వేలో టీబీ రహిత పంచాయతీలుగా ఎన్నికైన కోవిలంపాడు పంచాయతీ సర్పంచ్ షేక్.ఖాదర్‌బీ బుజ్జికి, అరివేముల పంచాయతీ సర్పంచ్ సన్నపురెడ్డి రాధా రుక్మిణమ్మ తరుపున సన్నపురెడ్డి ప్రకాష్‌రెడ్డిలకు జేసీ రోణంకి గోపాలకృష్ణ టీబీ ముక్తభారత్ అభియాన్ అవార్డులు అందజేశారు. ఈసందర్భంగా ఇరువురు సర్పంచ్‌లను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

టంగుటూరులో మోస్తరు వర్షం



టంగుటూరులో వర్షం పడుతున్న దృశ్యం

టంగుటూరు: ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు సాయింత్రం కురిసిన వర్షం కాస్త ఊరట లభించింది. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం శుక్రువారం కురిసింది. ఈ వర్షంతో గ్రామాలల్లో అని రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. స్థానిక బొమ్మల సెంటర్‌లో వర్షం నీరు పారుతుండటంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరాయి. గత రెండు మూడు రోజులుగా మండలంలో సుమారు 65 మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు గరిష్ట ధర కేజీ రూ 280 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పెద్ద కట్ల గుంట, నరసరాజుపాలెం, అయ్యప్పరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 718 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. అందులో 534 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 184 బేళ్లను తిరస్కరించారు. పొగాకు కనిష్ట ధర కేజీ రూ 200, సరాసరి ధర కేజీ రూ 245.75గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: శుక్రవారం జరిగిన వేలంలో 669 పొగాకు బేళ్లు కొనుగోలు జరిగాయి. చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 768 బేళ్లను వేలాని తీసుకురాగా వాటిలో 669 కొనుగోలు జరగగా, 99 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర రూ. 280 కాగా, కనిష్ట ధర రూ. 200 పలకగా, సరాసరి రూ. 250. 98 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

227 బేళ్లు తిరస్కరణ

కనిగిరిరూరల్: స్థానిక వేలం కేంద్రంలో 227 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇమ్మడి చెరువు క్లస్టర్ పరిధిలోని గ్రామాల నుంచి మొత్తం 421 పొగాకు బేళ్లు వేలం కేంద్రానికి రాగా అందులో 194 బేళ్లను మాత్రమే బయ్యర్లు కొనుగోలు చేసి, 227 బేళ్లను తిరస్కరించారు. మొత్తం 10 కంపెనీలు పొగాకు వేలం కేంద్రంలో పాల్గొన్నట్లు వేలం నిర్వాహణ అధికారి కోటేశ్వరరావు తెలిపారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ 280 పలుకగా, కనిష్ట ధర రూ 200 పలికింది.